ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 4 డిసెంబరు 2025



తొలి విడత లెక్క తేలింది..





- 11న ఐదు మండలాల్లో పోలింగ్..
- బరిలో 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1377 మంది వార్డు అభ్యర్థులు
- ప్రచార బాటలో అభ్యర్థులు..
- పల్లెల్లో ఎన్నికల కోలాహలం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల్లో తొలి విడత పోరు లెక్క తేలింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 సర్పంచ్, 2268 వార్డు స్థానాలకు ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఇందులో ఏకగ్రీవాలు మినహాయించి ఎన్నికల ప్రక్రియ నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తొలి విడతలో రుద్రంగి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి మండలాల్లో 85 సర్పంచులు, 748 వార్డులకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. ఈనెల 11న పోలింగ్ నిర్వహించనున్నారు. ఏకగ్రీవాలతో పదవులు దక్కించుకున్న వారు సంబరాల్లో ఉంటే బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచార బాట పట్టారు. ఓటర్లను తమకు అనుకూలంగా ఉండే విధంగా అన్ని మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టారు. తొలి విడత ఎన్నికల్లో 76 సర్పంచ్ స్థానాల్లో 295 మంది, 519 వార్డులకు 1377 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు, తొమ్మిది మంది సర్పంచ్, 229మంది వార్డు సభ్యులుగా ఏకగ్రీవమయ్యారు. మలి విడతలో బోయిన్‌పల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డుల స్థానాలకు వచ్చిన నామినేషన్ల పరిశీలన పూర్తి చేశారు. ఐదు సర్పంచ్, 94 వార్డులు స్థానాలకు ఏకగ్రీవమయ్యాయి. ప్రకటించాల్సి ఉంది. బరిలో ఉండే అభ్యర్థులు ఉపసంహరణల ప్రయత్నాలు మొదలుపెట్టారు. బుధవారం తుది విడతలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో 87 సర్పంచు, 762 వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. దీంతో జిల్లాలో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది.

తొలి విడతలో 9 మంది సర్పంచ్, 229 వార్డులు ఏకగ్రీవం

జిల్లాలోని తొలి విడతలు ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాల్లో 9 మంది అభ్యర్థులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. రుద్రంగి మండలంలో 10 గ్రామపంచాయతీలు ఉండగా, గిరిజన తండాల్లో ఏడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అడ్డబోరు తండ సర్పంచ్‌గా గూగులోతు మంజుల, గైదీగుట్ట తండా సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోతు మంజుల, చింతామణితండా సర్పంచిగా గుగులోతు సింధుజ, బడితండా సర్పంచ్‌గా మాలోతు రాందాస్,

మిగతా 8లో..

తొలి విడత బరిలో సర్పంచ్ అభ్యర్థులు 295 మంది, వార్డు అభ్యర్థులు 1377 మంది..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడతలో ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాలు ఉండగా తొమ్మిది స్థానాల్లో ఏకగ్రీవం కాగా 76 గ్రామపంచాయతీలు 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా, 519 వార్డుల్లో 1377 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

తొలి విడత బరిలో అభ్యర్థులు

మండలం	సర్పంచ్	వార్డులు
రుద్రంగి	10	91
వేములవాడ	47	218
వేములవాడ రూరల్	52	262
కోనరావుపేట	122	459
చందుర్తి	64	347
మొత్తం	295	1377

రెండో విడతలో 432 సర్పంచ్.. 1677 వార్డులకు అభ్యర్థులు

పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ అభ్యర్థులు రెండో విడతలో బుధవారం నామినేషన్ల పరిశీలన పూర్తి చేశారు. మూడు మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డు సభ్యుల స్థానాలకు ఉండగా సర్పంచ్ స్థానాల్లో 432 మంది అభ్యర్థులు, 1677 వార్డు అభ్యర్థులు ఉన్నారు. ఉపసంహరణలకు ఈనెల 9వ తేది వరకు గడువు ఉంది.

రెండో విడత బరిలో అభ్యర్థులు

మండలం	సర్పంచ్	వార్డులు
బోయిన్‌పల్లి	190	533
ఇల్లంతకుంట	112	597
తంగళ్లపల్లి	130	547
మొత్తం	432	1677

తుది విడతలో తొలి రోజు 147 సర్పంచ్.. 268 వార్డులకు నామినేషన్లు

గ్రామపంచాయతీ తుదివిడత ఎన్నికల సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల పర్వం మొదలైంది. తుది విడతలో నాలుగు మండలాల్లో 87 సర్పంచులు, 762 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి 29 కేంద్రాల ద్వారా నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 147 నామినేషన్లు, 268 వార్డు స్థానాలకు నామినేషన్లు వచ్చాయి.

తుది విడతలో తొలి రోజు నామినేషన్లు

మండలం	సర్పంచ్	వార్డులు
ఎల్లారెడ్డిపేట	56	89
వీర్నపల్లి	11	10
ముస్తాబాద్	45	100
గంభీరావుపేట	35	69
మొత్తం	147	268

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు..

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్‌బీ గీతే, జిల్లా ఎన్నికల పరిశీలకులు రవికుమార్, వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ కుముదిని మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందేలా రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి ప్రలోభాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్లపై ముద్రణ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలన్నారు. సింగిల్ నామినేషన్ వచ్చిన గ్రామాలు ఉంటే అండర్‌టేకింగ్ తీసుకోవాలని, సర్పంచ్ పదవుల వేలం ప్రక్రియ ఎక్కడ జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీకి షెడ్యూలు తయారు చేయాలని, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అవసరమైన మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ సిబ్బంది శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో అంతర్ జిల్లాల చెక్ పోస్టుల ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా సంక్షమాధికారి లక్ష్మీరాజం, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, నోడల్ అధికారి నవీన్, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం..

- సిరిసిల్లలో నల్లబ్యాడ్జీలతో బీజేపీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం బీజేపీ పట్టణకమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందువు దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ హిందు దేవుళ్లను అవమానించే ధైర్యం ఎవరికి ఉండకూడదని అన్నారు. గతం సిరిసిల్ల ఎమ్మెల్యే సైతం హిందూ దేవుళ్లను అవమానించి చివరికి తన పార్టీ కార్యాలయంలోనే హనుమాన్ దీక్షదారులతో కలిసి భజన చేసి తానుచేసిన తప్పులను ఒప్పుకున్నారని అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన వారిపై బీజేపీ వదిలిపెట్టిందన్నారు. సీఎం స్థాయిలో ఉండి కూడా రేవంత్‌రెడ్డి హిందువు దేవుళ్లపై అనుచిత వాఖ్యాలు చేయడం అర్హతలేనిదన్నారు. ఇప్పటికైనా సీఎం హిందూ దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, మాజీకౌన్సిలర్ గుడురి భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు అంకారపు రాజు, మోర శ్రీహరి, మేరుగు శ్రీనివాస్, కొండ నరేష్, మోర రవి, చొప్పదండి శ్రీనివాస్, దూడం సురేష్, సూరం వినయ్, చొక్కి శ్రీనివాస్, రచ్చ రాహుల్, పల్లి కొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

- త్వరలో అందుబాటులోకి యూడీఐడీ కేంద్రం సేవలు - ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి దివ్యాంగుల ఆటపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో పాటు చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సెర్ప్ ఆధ్వర్యంలో యుడీఐడీ కేంద్రం అందుబాటులోకి వస్తుందన్నారు. యూడీఐడీ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. త్వరంలో డేకేర్ సెంటర్ సేవలు సైతం త్వరలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. రెగ్యులర్‌గా శిబిరాలను నిర్వహిస్తూ అలింకో ద్వారా సహాయ ఉపకరణాలు అందిస్తామని దివ్యాంగులకు హామీ ఇచ్చారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి వికలాంగుల సంఘానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ. 8లక్షల బ్యాంక్ లింకేజ్ రుణానికి సంబంధించిన పత్రాలు సంఘం బాధ్యులకు ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు. అనంతరం బ్యాంక్ అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్ దివ్యాంగులు వృద్ధులు, సంక్షేమ సంఘం సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో...

సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరం ఆవరణలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడలలో విజేతలైన దివ్యాంగులకు బహుమతుల ప్రదానం చేశారు. అదే విధంగా స్థానిక వ్యాపారి పుల్లూరి కృష్ణమూర్తి 60 మంది దివ్యాంగులకు ఉచితంగా దుప్పట్లు, పౌర సంక్షేమ సమితి మహిళలకు చీరలను పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం 100 మంది దివ్యాంగులకు ఉచిత భోజన అందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వేముల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య, ఉపాధ్యక్షులు జవ్వాజి అమర్నాథ్, సుజాత, సుల్తానా, దివ్యాంగులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడొద్దు..

- బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడిన చూస్తూ ఊరుకునేది లేదని బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ అన్నారు. పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ హిందూ దేవుళ్లను సీఎం రేవంత్‌రెడ్డి కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అయి ఉండి హిందువుల విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అప్పటి సీఎం కేసీఆర్ పరిస్థితి ఏమైందో గుర్తు పెట్టుకోవాలని, హిందువులను కించపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డికి సైతం అదేగతి పడుతుందని మండిపడ్డారు. ఇలాంటి భావజాలం ఉన్న పార్టీలకు ఓటు వేస్తే దేశం ఏమైపోతుందో ఓటరు మహాశయులు ఆలోచన చేయాలన్నారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పెట్టుకుందా. అని ప్రశ్నించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అంటేనే హిందువుల వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. హిందువులందరు ఏకమై సనాతన ధర్మంపై దాడిచేసే వారికి తగిన బుద్ధి చెప్పే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం హోదాలో ఉండి హిందూ దేవుళ్ల గురించి అలా మాట్లాడటంతో రాష్ట్ర వ్యాప్తంగా హిందువుల్లో వేదన మొదలైందన్నారు. రాబోవు రోజుల్లో బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపాలని కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కట్కం శ్రీనివాస్, నేరేళ్ల సాయి, మేర్గు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'సైర్' అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ మహేష్ బీ గీతే - జిల్లా పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న 65 మందికి తిరిగి అప్పగింత..



మొబైల్ ఫోన్ల యజమానులతో ఎస్పీ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు పోయినా, చోరీకి గురైనా బాధితులందరు సైర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మహేష్ బీగీతే అన్నారు. జిల్లావ్యాప్తంగా పోయిన సుమారు రూ 60లక్షల విలువైన మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మొబైల్ ఫోన్ రికవరీ మేళాను ఏర్పాటు చేసి 65 మొబైల్ ఫోన్ల యజమానులకు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేమని, మన విలువైన సమాచారం, బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్‌వర్డ్‌లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో పాటు డబ్బులను కోల్పోతున్నారన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సైర్ అప్లికేషన్‌లో బ్లాక్ చేసి, సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు ఎవరైనా సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేసినా ఆ దుకాణయజమాని నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్‌లను మొబైల్ షాప్‌లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సైర్ పోర్టల్ ద్వారా 2183 ఫోన్లను గుర్తించి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు అందించామని పేర్కొన్నారు. సైర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్‌లను 83 శాతం రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐటీ కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్‌లను ఎస్పీ అభినందించారు. పోయిన మొబైల్ ఫోను మళ్లీ దొరకదనుకున్న బాధితులు మొబైల్ ఫోన్ జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు జిల్లా ఎస్పీకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, ఆర్ఐ యాదగిరి, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల సాధికారతకు కృషి చేయాలి

- అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి



మాట్లాడుతున్న అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సాధికారతను ప్రోత్సహిస్తూ సమాజ నిర్మాణం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అసిస్టెంట్ లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. చిన్నారుకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, ప్రభుత్వ పథకాలు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర స్వామి, భవిత కేంద్రం ఐఈఆర్పీ కల్యాణిలు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

గంభీరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల నామినేషన్ స్వీకరణలో భాగంగా గంభీరావుపేటలోని ఆర్వో కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్‌తో పాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కేజీటూపీజీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో తరగతి గదిలో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెనూపై ఆరా తీశారు. తహసీల్దార్ మారుతిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన పరిశీలకుడు



ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యయ పరిశీలకుడు

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని, ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. బుధవారం జిల్లా సరిహద్దులోని ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేసి వాహనాల నమోదును పరిశీలించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ రిజిస్టర్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీవో లక్ష్మీనారయణలు ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి..

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో పాటు అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

చందుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంతోపాటు మల్యాల, కట్టలింగంపేట గ్రామాల్లోని నామినేషన్ల కేంద్రాలను బుధవారం సందర్శించారు. అయన వెంట ఎస్సై రమేష్ ఉన్నారు. కాగా, మండలంలోని ఆశీరెడ్డిపల్లి, అనంతపల్లి, మూడపల్లి గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై ఎస్సై జె. రమేష్ అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను స్పష్టం చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ ఎస్ఐ జువైద్ అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ జువైద్ మాట్లాడుతూ సైబర్ మోసాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంక్ వివరాలను పంచుకోవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారాలు, ఫొటోలు ఇతరులతో పంచుకోవడం మంచిది కాదన్నారు. ఏదైనా మోసం జరిగితే 1930 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ట్రాక్టను ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో చోటుచేసుకుంది. పత్తిపాకకు చెందిన నవనందుల రాజేష్, అరవెండి కిష్టయ్య, మంగారపు సాయికుమార్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం బైక్‌పై గంగ స్నానానికి గోదావరికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పత్తిపాక గ్రామ డాంబర్ ప్లాంట్ సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న నవనందుల రాజేష్(36) అక్కడికక్కడే మృతిచెందగా కిష్టయ్య, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ ప్రవీణ్ సందర్శించి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన బోయినిపల్లి వెంకటరమణారావు(56) బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గతనెల 30న వెంకట రమణారావు బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడ్డాడని, తలకు తీవ్రగాయాలవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. వెంకటరమణారావు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలైనవ్యక్తి మృతిచెందిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కునసపల్లి మురళి(48) ఈ నెల 1న సుతారీ మీటింగ్ నిమిత్తం రెబ్బనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో పొలాల నుంచి వస్తున్న ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో మురళి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. వెంటనే మురళిని హుటాహుటిన 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మురళి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఓదెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంసానిపల్లికి చెందిన కందుల రాజు(35) అనేవ్యక్తి పురుగులమందు తాగి బుధవారం మృతిచెందాడు. మతిస్థిమితం సక్రమంగా లేక మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



హుజూరాబాద్‌లో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద విశ్వకర్మ మన్మయసంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, రఘు, సత్యానారాయణ, శ్రీనివాస్, వీరాచారి, సదానందం, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు



డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి ఓ లారీడ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడుపుకుంటూ వెళ్తుండగా ఎల్‌ఎండీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి లారీని సీజ్ చేశారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ లారీ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ రాజీవ్ రహదారిపై వెలుతుండగా గమనించిన బ్లూకోల్ట్ సిబ్బంది లారీని వెంబడించారు. సుభాష్‌నగర్ వద్ద లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా అతిగా మద్యం సేవించినట్లు వచ్చింది. అతివేగంతో పాటు అతిగా మద్యం సేవించి లారీ నడుపుతున్న లారీ డ్రైవర్ మెదక్ జిల్లా నర్సింగ్ గ్రామానికి చెందిన కబూజి వేణును అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీని సీజ్ చేసి ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు

బీసీలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో బీసీ సామాజిక బిడ్డపై అగ్రవర్ణాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ జేఏసీ, ప్రజాస్వామిక బీసీ ఉద్యమవేదిక నాయకులు అన్నారు. బుధవారం వారు వేర్వేరుగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 78ఏళ్లు గడుస్తున్న అగ్రవర్ణాల ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయన్నారు. నల్గొండ జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మి తమ స్వగ్రామంలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగా, ఆమెభర్త యాదగిరిని కిడ్నాప్‌చేసి మూత్రం తాగించిన సందీప్ రెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, ప్రభాకర్, సమ్మయ్య, కేశవులు, ఓదెలు, రామ్, సారన్న, మధుకర్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్, క్రాంతి, రవీందర్, సదానందం, ప్రభాకర్, ముత్యంరాజు, ఖలీద్ హుస్సేన్, రాజేశ్వరరావు, చారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కేంద్రం కానుక

- పీఎం సమృద్ధి యోజన ద్వారా భరోసా
- వేములవాడలో 3,260 మందికి రుణాలు



వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోడ్లపక్కన తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని బతుకు బండితో జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారు లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం కానుకగా మారింది. తోపుడు బండ్లపై ఆధారపడి కాలం గడుపుతున్న వ్యాపారులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తే విడుతల వారీగా రూ.10వేల నుంచి 50 వేల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకంలో వ్యాపారం చేసుకోవడానికి ఎలాంటి పర్మినెంట్ భవన సముదాయం లేని, కొట్టు లేని, షటర్స్ లేని, రెంట్ భవనం లేని వారు, వీధుల్లో పండ్లు, కూరగాయాలు, తోపుడు బండ్లను వినియోగించి వివిధ రకాల వస్తువులను విక్రయించేవారు, మటన్, చేపలను విక్రయించే వారు అర్హులు. వేములవాడ మున్సిపాలిటీలో కోనాయపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, తిప్పాపూర్ గ్రామాలు విలీనం కావడంతో 28 వార్డులుగా రూపాంతరం చెందింది. ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న పట్టణం కావడంతో పట్టణంలో చిరు, వీధి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో జీవిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో ఆర్పీ, సీఎల్‌ఆర్పీ, టీఎంసీలతో పట్టణ, సెమి అర్బన్ ప్రాంతాలలో చురుకైన వీధి వ్యాపారులు ఉన్న ప్రాంతాలను ముందుగా గ్రీన్, అంబర్, రెడ్ జోన్లుగా వర్గీకరించారు. గ్రీన్ జోన్ (వ్యాపారానికి అనుకులంగా) 3,133 మందిని, అంబర్ జోన్ (కాలనుగుణంగా వ్యాపారం చేసే వారు) 127 మందిని, రెడ్ జోన్‌లో ఎవరూ లేకపోవడంతో మొత్తంగా 3,260 మంది వ్యాపారులను గుర్తించారు.

● లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 3,260 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందించారు. అధికారులు సర్వే నిర్వహించి గుర్తించిన అనంతరం వ్యాపారులు ప్రస్తుతం తమ కొట్టు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్‌లతో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి. సంబంధిత ధ్రువపత్రాలను సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేసి ఐడీ కార్డులను వ్యాపారులకు అందిస్తారు. మొదటి విడతలో రూ. 10 వేలు బ్యాంకు మంజూరు చేస్తుంది. సంవత్సరం లోపు లోన్ డబ్బులు చెల్లిస్తే రెండవ విడుత రూ. 20 వేలు, మూడవ విడుత రూ. 50 వేలు బ్యాంకు వారు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు మొదటి విడుతలో 2,453 మంది వ్యాపారులు రూ. 10 వేల రుణం తీసుకోగా, రెండవ విడుతలో 1,689 మంది రూ. 20 వేలు, 367 మంది రూ.50 వేల రుణాన్ని తీసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



చిరు వ్యాపారులకు చేయుత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పట్టణంలో వ్యాపారులను గుర్తించి ఐడీ కార్డులను అందజేశాం. బ్యాంకు నిబంధనలకు లోబడి రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే రూ. 50 వేల వరకు లోన్ తీసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ పట్టణంలో అర్హులైన చిరు, వీధి వ్యాపారులు ఉంటే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రవాణాశాఖ ఆధ్వర్యంలో.. వాహనాల తనిఖీ



పట్టుకున్న వాహనాలతో ఏఎమ్‌వీఐ

ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏఎమ్‌వీఐ రజనీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని 13వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు చెల్లించాలని సూచించారు. కొంత మంది వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లను రవాణాకు వాడుతున్నారని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానాలు పడుతాయని, వాహనాల నంబర్ ప్లేటు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్ల దొంగ అరెస్ట్

● 38 సిలిండర్లు స్వాధీనం



పట్టుబడిన సిలిండర్లతో పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని పలు ఇళ్లలో సిలిండర్లు అపహరించుకువెళ్ళిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన షేక్‌సమీర్ అనే వ్యక్తి పట్టణంలోని ఓ సిలిండర్ గోదాంలో పనిచేస్తూ ఇళ్లకు గ్యాస్ సిలెండర్లను సప్లై చేస్తుండేవాడు. గోదాంలో పని మానేసిన తర్వాత సిలెండర్ల దొంగతనానికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. గోదాంలో పని చేస్తున్న సమయంలో ఎవరి ఇంటి వద్ద రక్షణ లేకుండా సిలెండర్లు ఉంటాయో గమనించి పట్టణంలోని పలువురి ఇళ్లనుంచి 38సిలిండర్లను అపహరించుకొని వెళ్లాడు. సిలిండర్లు అపహరణకు గురైన పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్‌ఐలు ఎ.కుమారస్వామి,సిహెచ్ రవికిరణ్, ఎం. సుప్రియ, కానిస్టేబుల్ జీవన్ పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి అనుబంధ దేవాలయం అయిన యమ ధర్మరాజు ఆలయంలో ఆయుష్యహోమం నిర్వహించారు. యమ ధర్మరాజు వారికి పురుష సూక్తం, శ్రీలక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేకపూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, అర్చకులు నేరెళ్ల వంశీ కృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, సంతోష్ కుమార్, సిబ్బందిఅర్చకులు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని.. మోసం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో నిందితుడు నగునూర్‌కు చెందిన బత్తిని శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన యువతి(19) తన మేనత్తతో ప్రతిమ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆ సందర్భంలో ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరుకు చెందిన బత్తిని శ్రావణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని యువతిని నమ్మిస్తూ వచ్చాడు. ప్రేమ విషయం యువతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి పొమ్మన్నారు. అప్పటినుంచి శ్రావణ్‌కుమార్ ఫోన్‌స్విచ్ ఆఫ్ చేసుకోవడం, ఆమెను కలువకపోవడంతో నవంబరు 21న నగునూరులోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం శ్రావణ్ తల్లిదండ్రులతో చెప్పింది. వారు ఆ యువతిని దూషించి వెనక్కి పంపించారు. ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి కరీంనగర్‌రూరల్ పోలీసులకు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ కుమార్ తన మిత్రులను ఆ యువతి వద్దకు పంపించి తన సోదరి వివాహం అనంతరం రెండేళ్లకు వివాహం చేసుకుంటానని, అప్పటివరకు ఖర్చులు తానే భరిస్తానని బోదాసు దేవేందర్, దావు రవితేజ సమక్షంలో ఒప్పుకొని పేపర్‌పై రాసిచ్చాడు. ఆ మరుసటిరోజు నుంచి శ్రావణ్‌కుమార్ మళ్లీ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని యువతిని పట్టించుకోవడం లేదు. దీంతో శ్రావణ్‌కుమార్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయంచేయాలని రూరల్‌పోలీసులను ఆశ్రయించింది. యువతిని వైద్యపరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

ఎట్టకేలకు మినీ స్టేడియం పనులకు మోక్షం

● గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిన పనులు ● ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



మినీస్టేడియం గ్రౌండ్‌లో కంకర తేలిన ట్రాక్



నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన మినీస్టేడియం పనులు పదకొండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తిప్పాపూర్ గ్రామ శివారులో 2014 సంవత్సరంలో రూ2.10కోట్ల నిధులతో మినీస్టేడియం నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు. నిధుల విడుదలలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత మంత్రితో మాట్లాడి ఇటీవల రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పనులు పుంజుకున్నాయి.


ప్రస్తుతం మినీ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేసేందుకు సోషల్ వెల్ఫేర్‌శాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వచ్చే మార్చి వరకు పనులను పూర్తిచేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

చివరి దశలో పనులు..

వేములవాడ ప్రాంత ప్రజల కోసం నిర్మించే మినీస్టేడియం పనులు ఎట్ట కేలకు చివరిదశకు వచ్చాయి. మినీస్టేడియంలో ఇప్పటివరకు డ్రెస్సింగ్ రూములు, కార్యాలయం భవనం, విశ్రాంతి భవనం, క్రీడా సామగ్రి భద్రపరిచే గదులు నిర్మాణ పనులు పూర్తిచేశారు. కిటికీలు, ప్రికాస్ట్ గోడలు, తలుపులతో పాటుగా ఇండోర్ స్టేడియం పైకప్పు పూర్తి చేశారు. ఆర్చిగేటు పనులు కొంతఆలస్యంగా కొనసాగుతున్నాయి. స్టేడియంలోని ట్రాక్‌పై కంకర తేలింది. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇతర పనులు వచ్చే మార్చిలోపు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ..

- 18 తులాల బంగారం,
- 111 తులాల వెండి,
- 1.55 లక్షల నగదు అపహరణ



తలుపునకు బిగించిన గడియను కట్ చేసిన దొంగలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రగతినగర్‌లోని విజేత మనోహర హెవెన్స్ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి 2గంటల సమయంలో ముగ్గురు దొంగలు ముసుగులు, గ్లౌజ్‌లు ధరించి ప్లాట్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేశారు. అపార్ట్‌మెంట్‌లోని కేశెట్టి సందీప్‌కుమార్ దగ్గరి బంధువు మరణించడంతో గతనెల 6వ తేదీన ప్లాట్‌కు తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఉదయం అపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చేసరికి తన ప్లాట్ తాళం పగులగొట్టి ఉంది. బీరువా, పూజగదిలో భద్రపరిచిన 10తులాల బంగారం, 111తులాల వెండి, లక్షా55వేల రూపాయలు నగదు కని పించలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లోని మరోప్లాట్‌లో నివాసం ఉంటున్న మూల కిష్టయ్య శనివారం తాళంవేసి గట్టెపల్లికి వెళ్లాడు. ఆయన భార్య 2నెలల కిందట మరణించింది దొంగలు ప్లాట్ తాళాలు పగులగొట్టి బెడ్‌రూంల్లోని సామగ్రి, దుస్తులను చిందరవందర చేశారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఏడాది కిందట ఈ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఇంటితాళాలు పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఆ కేసులో ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదని బాధితుడు రఘునందన్‌రావు వాపోయాడు.

● ఉదయం 2గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వెనుకవైపు నుంచి ప్రహరీ దూకిన ముగ్గురు దొంగలు మొదట వాచ్‌మెన్ ఇంటి తలుపునకు గడియపెట్టారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లోని తాళం వేసిన ప్లాట్‌ల వద్దకు వెళ్లి ఎదుట, పక్కన ప్లాట్‌ల తలుపులకు బయట నుంచి గడియపెట్టారు.

ఆయాప్లాట్‌ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. దాదాపు 3గంటల వరకు ముగ్గురుదొంగలు అపార్ట్‌మెంట్‌లోనే గడిపారు. ఎవరూ బయటకు రాకపోవడంతో వారిపని కానిచ్చారు. వాచ్‌మెన్ కూతురు 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా బయటువైపున గడియపెట్టిన విషయం అర్థమైంది. వెంటనే అపార్ట్‌మెంట్ వారిని వాచ్‌మెన్ అప్రమత్తం చేశాడు. అలికిడి వినడంతో దొంగలు అక్కడినుంచి పరారీ అయ్యారు. దొంగలు కొంతదూరంలో పార్క్ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలలో దొంగతనం మొత్తం రికార్డు అయ్యింది. సంఘటన స్థలాన్ని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సై అరుణ్ పరిశీలించారు. క్లూస్‌టీం రెండు ప్లాట్‌లలో ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవిపందుల బీభత్సం

కోనరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో అడవిపందులు మంగళవారం రాత్రి బీభత్సాన్ని సృష్టించాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం మీద కప్పిన కవ ర్లను చించివేశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో ప్రతిరోజు రాత్రిపూట ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తులను నియమించాలని కోరుతున్నారు. అధికారులు కాపలా ఎవరిని పెట్టకపోవడంతో అడవి పందులతో నష్టపోతున్నామని తెలిపారు.

బీరు బాటిళ్లు దాచిన ఘటనపై విచారణ

● ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 2న యువకులు తరలిస్తున్న బీరు బాటిళ్లను ఎక్సైజ్ కానిస్టేబుళ్ల స్వాధీనపర్చుకుని 4బీరు బాటిళ్లను దాచుకున్న ఘటనపై ఆ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు బుధవారం విచారణచేపట్టారు. కానిస్టేబుళ్ల వ్యవహరించిన తీరుపై ఆరా తీశారు. బీరు బాటిళ్లను దాచుకున్నట్లు నిర్ధారణ కావడంతో కానిస్టేబుళ్ల రాజు, కిశోర్, మల్లేశంను కరీంనగర్ నోడల్ కార్యాలయానికి సరెండర్ చేశారని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్తు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (అంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామశివారు శ్మశానవాటికలో ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారని స్థానికులు తెలిపారు. కరెంటు తీగ విలువ సుమారు రూ.7వేలు ఉంటుందని పేర్కొన్నారు.

రూ.7250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 338 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొ చ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయస్థానం



పతకాలు సాధించిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా మహిళాజట్టు తృతీయస్థానం సాధించింది. హైదరాబాద్‌లోని మోహినాబాద్ ఫైర్ఫాక్స్ స్పోర్ట్స్ రిసార్ట్‌లో గతనెల 28న జరిగిన 12వ రాష్ట్రస్థాయి ఇంటర్ జిల్లా టేబుల్‌టెన్నిస్ చాంపియన్ పోటీల్లో పెద్దపల్లిజిల్లా మహిళాజట్టు హైదరాబాద్‌తో తలపడగా పెద్దపల్లి జట్టు తృతీయస్థానంలో నిలిచి పతకాలు సాధించింది. విజయం సాధించిన జట్టును జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పల్ల సురేష్, దాసరి రమేష్, ఎస్కే. ఇక్బాల్, ప్రణయ్, తిరుపతి అభినందించారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



బానోతు శృతి | లియాన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో ఈ నెల1 నుంచి 3వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వపాఠశాల విద్యార్థినులు సత్తాచాటి పతకాలను కైవసం చేసుకున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య తెలిపారు. 58కేజీలలోపు విభాగంలో బానోతు శృతి అద్వితీయ ప్రతిభకనబరిచి బంగారు పతకం కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిందని తెలిపారు. అలాగే 54 కేజీలలోపు విభాగంలో రాణించిన లియాన కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముల్కూరి రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆన్‌లైన్ సేవలకు ప్లాట్‌ఫాం ఉమాంగ్

- కేంద్ర ప్రభుత్వ అధికారిక యాప్‌లో అన్ని సైట్లు
- ఒకే యాప్‌లో 2 వేలకుపైగా వెబ్‌సైట్లు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఉమాంగ్ యాప్‌ను రూపొందించారు. ఆన్‌లైన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక డిజిటల్ గవర్నెన్స్ అప్లికేషన్‌గా ఉమాంగ్(యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్)ను రూపొందించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ దాదాపు 2 వేలకుపైగా వెబ్‌సైట్లు ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి. 13 ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది. మైస్కీం, డిజిలాకర్‌కు అనుసంధానంగా ఈ యాప్ పనిచేస్తుంది. ప్రభుత్వ సేవలకు వేర్వేరు వెబ్‌సైట్లు, యాప్స్‌కు అవకాశం లేకుండా, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే మొబైల్ ఫోన్‌లో సేవలను పొందవచ్చు.

అందుబాటులో సేవలు

రాష్ట్రానికి సంబంధించిన మీసేవ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్‌కు ఉమాంగ్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పించన్లకు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్, విద్యార్థులకు కాలేజీలు, యూనివర్సిటీలు, అప్రూవ్‌డ్ విద్యాసంస్థల వివరాలు తెలసుకోవచ్చు. ఏఐసీటీఈ, ఎస్ఎస్‌సీ వెకెన్సీలు తెలుసు కోవచ్చు. యూజీసీకి సంబంధించిన ఈ బుక్స్, సిలబస్, పాత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు, రీసెర్చ్ వివరాలు అందు బాటులో ఉంటాయి. పరీక్ష క్యాలెండర్ వివరాలు తెలుసుకోవచ్చు. రేషన్ కార్డులు, ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్, విద్యుత్ బిల్, రైతులకు సంబంధించిన ఈనామ్ మార్కెట్ వివరాలు, పీఎం కిసాన్ యాప్ ద్వారా ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకో వచ్చు. ఇవే కాకుండా స్త్రీ శిశు సంక్షేమశాఖ, యూత్ స్కిల్ ఎంపవర్‌మెంట్, వైద్య సర్వీ సులు, పోలీస్, రవాణాతోపాటు అనేక శాఖల సేవలన్నీ ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వ సేవలు

ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్‌లను డిజిటల్‌గా యాప్‌లో స్టోర్ చేసుకుని షేర్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో సేవలను పొందవచ్చు. ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సేవలు, పింఛన్ పత్రాలు, సర్టిఫికెట్‌ను పొందవచ్చు. 2 వేలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నీ యాప్ ద్వారా పొందవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ లేదా యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఉమాంగ్ అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. న్యూ యూసర్/రిజిస్టర్‌ను క్లిక్ చేసి మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఎంపిన్‌ను సెట్ చేసుకున్న తర్వాత ఆధార్ డేటాను నమోదు చేయాలి. లాగిన్ అయిన తర్వాత డాష్ బోర్డులో ఆల్ సర్వీసెస్ ద్వారా కావాల్సిన సేవను ఎంచుకోవాలి. 80 కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 1,745 ఆన్‌లైన్ సేవలు, వివిధ రాష్ట్రాల సేవలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

ముగిసిన బీచ్ వాలీబాల్ పోటీలు



కేశవపట్నంలో జరిగిన పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికపోటీలను బుధవారం నిర్వహించారు. ఉమ్మడిజిల్లాలోని వివిధపాఠశాలల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సుభాష్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7నుంచి 9వరకు ఖమ్మంజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుడు కాముర్రాజు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ సెక్రెటరీ శ్రీను, మోడల్ స్కూల్‌పీడీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, కోశాధికారి వీరపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నిర్మల, సాగర్, మహేష్‌హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సైనిక్ స్కూల్ విద్యార్థి



ఎన్ సిద్ధు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్‌పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఎన్.సిద్ధు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడు. ఇదే స్కూల్‌కుచెందిన వరుణ్‌తేజ కాంస్య పతకం గెలుచుకున్నాడు. విద్యార్థులను, కోచ్‌వంశీకృష్ణ, పీఈటీ సుమన్, విక్రమ్‌ను డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, ప్రమోద్‌రాజు అభినందించారు.

అంధుల పాఠశాల విద్యార్థితో కలిసి పాట పాడిన కలెక్టర్



విద్యార్థితో కలిసి పాడుతున్న కలెక్టర్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్‌లోని అంధుల పాఠశాల విద్యార్థిని సింధుశ్రీతో కలిసి కరీంనగర్ జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి పాట పాడారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులలో స్ఫూర్తి నింపేందుకు పాటను యూట్యూబ్‌లో పోస్ట్ చేశారు. సినీగేయ రచయిత చంద్రబోస్ 2009లోవిడుదల చేసిన నింగినేల నాదే.. అనే సినిమా కోసం రాసిన 'ఆరాటం ముందు ఆటంకం ఎంత' అనే పాటను విద్యార్థినితో కలిపి పాడారు. గతలో సింధుశ్రీ పాటపాడటం చూసిన కలెక్టర్ పాట పాడగా, కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజికల్ టీచర్ సరళ, స్థానిక మ్యూజిక్ డైరెక్టర్ కెబి శర్మ ఆధ్వర్యంలో పాటను రికార్డు చేశారు. గతంలోనూ జిల్లాకలెక్టర్ ఆడపిల్లను రక్షించుకుందాం అంటూ పాడిన ఓ చిన్ని పిచుక పాటకు విశేష ఆదరణ లభించింది.

సడన్ బ్రేక్ వేసిన బస్ డ్రైవర్

- 11మందికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు వేములవాడకు వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా ఓ కారు బస్సుకు అడ్డుగా వచ్చింది. దీంతో కారును తప్పించబోయి ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో సీట్లలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ముందు సీట్లకు తగిలి కింద పడిపోయారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కావడంతో వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బధిరుల పాఠశాలల్లో ఇంటర్ విద్య

- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయో వృద్ధులశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్‌సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజతోకలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఐదుశాతం కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం 50కోట్లరూపాయలు కేటాయించిదన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్‌లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామన్నారు. దివ్యదృష్టిని వృథా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వచ్చే సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం నాటికి



వేడుకలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వేడుకలో నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సమస్యలన్నీ పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. దివ్యాంగుల శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగుల్లో ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సైన్ లాంగ్వేజ్‌లో జనగణ మన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూపీఎస్సీ వంటి ఉన్నతఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. దివ్యాంగుల కో-ఆపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టిందన్నారు. 40శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీసీబీసీ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, అధికారులు,వికలాంగుల సంక్షేమసంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం..

హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అతడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బాలుడి చదువు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

- బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతరకు బుధవారం భారీ సంఖ్యలో భక్తులువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లోగర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) తులాభారంవేసి భక్తులకు పంచిపెట్టారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.79,510 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ట్రైనీకలెక్టర్ కన్నంహరిణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్ రెడ్డి, గీతా, టౌన్ ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

భీమన్న సన్నిధి వైపు వాహనాలకు బ్రేక్

- రెండు వైపులా రహదారి బంద్



ఉత్తరం వైపు బారికేడ్లతో మూసివేసిన రహదారి

వేములవాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వేములవాడకు భక్తుల రాక రోజురోజుకు పెరుగుతోంది. దీంతోభక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భీమేశ్వరాలయం వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం భక్తులు వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేశారు. రహదారిని పూర్తిగా బారికేడ్లు పెట్టి మూసివేశారు. ప్రధానంగా నటరాజ్ విగ్రహం ఉత్తరం వైపు, పార్వతీపురం అన్నదాన సత్రం వైపు బారికేడ్లు పెట్టి రహదారులు మూసివేశారు. దీంతో స్థానికుల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు పార్కింగ్ స్థలం వద్ద భారీ గేట్ ఏర్పరిచి కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే వాహనాలు పార్కింగ్‌లో పెట్టి కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధంగా దేవాలయానికి దక్షిణం వైపు విస్తరణ పేరిట ఇరువైపులా రహదారులు మూసివేశారు. దీంతో భక్తుల వాహనాలు, స్థానికుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా వేములవాడ పట్టణంలో పలుచోట్ల దేవాలయాలకు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రారంభమైన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. బుధవారం జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలకొండ రమణాచారిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజాకార్యక్రమలు జరిగాయి. సాయంత్రం ఎదురుకోళ్ల ఉత్సవం వైభవంగాసాగింది. కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యబృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామ కృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంత కౌశిక్, వివేక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం

బోయినపలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామ సమీపంలోని గుట్టపై దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. బుధవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు బోట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై రమాకాంత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

తొలి విడత లెక్క తేలింది..

(5వ పేజీ తరువాయి)

రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్, సర్పంచ్ తండా సర్పంచ్‌గా మాలోత్ రజితలతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోనరావుపేట మండలంలో ఊరుతండా సర్పంచ్‌గా ఇస్లావత్ మంజుల, కుమ్మరిపేటతండా సర్పంచ్‌గా మాలోతు మంజులలు వార్డు సభ్యులతో సహా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తంగళ్లపల్లి మండలం బాలమల్లుపల్లెలో సర్పంచ్‌గా యాద ఎల్లయ్య, వేణుగోపాల్‌పూర్ సర్పంచ్‌గా జూపల్లి రమాదేవితో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. ఇల్లంతకుంట మండలం చిక్కుడువానిపల్లె కళ్యాణ్, తిప్పాపూర్ సర్పంచిగా బొల్లవేణి మంజుల, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కేశన్నపల్లెలో సర్పంచ్ పోతరాజు చంటి ఏకగ్రీవం కాగా ఆరు వార్డులో ఏకగ్రీవమయ్యాయి. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గ్రామ పంచాయతీ వార్డుల్లో 229 మంది అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, ఇందులో రుద్రంగి మండలంలో 52 మంది, వేములవాడలో 14 మంది, చందుర్తిలో 29 మంది, వేములవాడ రూరల్‌లో 42 మంది, కోనరావుపేటలో 92 మంది సభ్యులు ఏకగ్రీవమయ్యారు. రెండో విడతలో ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవయ్యాయి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంటలో సర్పంచ్‌లో ఐదుగురు ఏకగ్రీవంగా వార్డు సభ్యులు 94 మంది ఏకగ్రీవమయ్యారు.

మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ రాష్ట్ర ఐదవ మహాసభలకు కార్మిక వర్గాలు తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ ఐదో మహాసభ పోస్టర్‌లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ మహా సభలకు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరం పద్మ, జిల్లా కమిటీ సభ్యులు ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, బెజుగం సురేష్, స్వరం శేఖర్, బింగి సంపత్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబ సభ్యుల నిరసన

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అధ్యాపకురాలు దండించిందని విద్యార్థి కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అధ్యాపకురాలును కళాశాల నుంచి తొలగించాలని విద్యార్థిని కుటుంబ సభ్యులు యాజమాన్యంతో వాగ్వాదం చేసిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో జరిగింది. ప్రతినెల నిర్వహించే పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులందరిని అధ్యాపకురాలు సున్నితంగా దండించింది. దీంతో ఓ విద్యార్థినీ కుటుంబ సభ్యులకు చెప్పడంతో కళాశాలకు చేరుకున్న బంధువులు అధ్యాపకురాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. అధ్యాపకురాలు క్షమాపణ చెప్పినా వినకపోవడంతో అధ్యాపకురాలును కళాశాల నుంచి తొలగించడంతో గొడవ సద్దుమనిగింది.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గీత జయంతిని పురస్కరించుకొని టీపీయూఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థులను ప్రీప్రైమరీ, ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హై స్కూల్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, రాష్ట్రకార్యదర్శి జగన్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి లెంకల జయకృష్ణారెడ్డి, బహుమతు లతో పాటు సర్టిఫికెట్లను బహూకరించి అభినందించారు. ఈ పోటీల్లో 52మంది విద్యార్థులు పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సంస్కృత ఉపన్యాసకులు మోహన్‌జీ, ఆచార్యులు శ్రీనాథ్, జీ కావ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా సంస్కృతిక కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, నాయకులు బిల్లా శ్రీకాంత్, రమేష్, రాజు, సతీష్, అంజన్న, చంద్రశేఖర్, ఆచార్యులు చిలుక వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల్లారా.. దీవించండీ..

- గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద నామినేషన్ పత్రాలు



గాంధీ విగ్రహంవద్ద నామినేషన్ పత్రాన్ని పెడుతున్న కృష్ణమూర్తి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహనీయుల్లారా దీవించండి.. అంటూ ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే బుగ్గ కృష్ణమూర్తి బుధవారం స్థానిక మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద తన నామినేషన్ పత్రాలను ఉంచారు. బాపూజీ, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అక్కడ నుంచి బయలుదేరి గొల్లపల్లిలోని కేంద్రం వద్ద నామినేషన్ దాఖలు చేశారు.

హామీలతో కూడిన బాండ్ పేపర్ విడుదల..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'అందరి నాయకుల్లా కాకుండా నేను ఎన్నికలకు ముందుగానే నా భవిష్యత్తు మీ చేతిలో పెడుతున్నా.. గ్రామాభివృద్ధికి నేను చేసే ప్రతి హామీని బాండ్ పేపర్‌లో రాయించి ఇస్తున్నా.. సర్పంచ్‌గా గెలిచిన తర్వాత హామీలను అమలు చేయకుంటే పదవి నుంచి దించుడే మీ పని..' అంటూ మండలంలోని గొల్లపల్లి సర్పంచ్ అభ్యర్థిదాసరి గణేశ్ నామినేషన్ వేయడానికి ముందు బుధవారం బాండ్ పేపర్‌ను విడుదల చేశారు. ఇచ్చే హామీలను రూ. 100 బాండ్ పేపర్‌పై రాసి గ్రామస్థుల ఎదుట ఉంచారు. గెలిచిన నెల రోజుల్లో తన స్వంత ఖర్చులతో అంబులెన్స్ సమకూర్చడంతో పాటు వైకుంఠ రథం, ఎస్సీ కాలనీలో వాటర్‌ప్లాంట్, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీలో మినీవాటర్ ట్యాంకును ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్, ధాన్యం కొనుగోలు కేంద్రంలో మినీ వాటర్‌ట్యాంకు ఏర్పాటుతో పాటు గ్రామాభివృద్ధికి పాటు పడుతానని పొందు పరిచారు.

ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే ధర్నాకు బీసీ నేతలు హాజరై విజయవంతం చేయాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈనెల 8,9వ తేదిల్లో ఢిల్లీలో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి 10వ తేదిన చేపట్టే ఓబీసీ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై పూర్తి బాధ్యత బీజేపి, జాతీయ పార్టీలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో చింతలకోటి రామస్వామి, ఉయ్యాల భూమయ్య, కత్రోజు ప్రభాకర్, దశగౌడ్, ఒన్నారపు శ్రీనివాస్, ఆసంపెల్లి దేవయ్య, బుర్ర శ్రీనివాస్, తూమ్ రాజు, గణేష్ శ్రీకాంత్, రవి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండ కాంగ్రెస్‌నాయకుడు ఉమ్మరవేని రాజు కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పరామర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజు కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కలిసి సంతాపం వ్యక్తంచేశారు. వెంట కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నీలం అంజయ్య, బొల్లవేని రమేష్‌లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని దివ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని ఎం దివ్యశ్రీని ప్రధానోపాధ్యాయురాలు,ఉపాధ్యాయులు ప్రశంసించారు. బుధవారం నెహ్రూనగర్ జడ్పీ హై స్కూల్లో నిర్వహించిన సమావేశంలో దివ్యశ్రీని ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, పీఈటీ షేక్ ఖాజా మోహియోద్దీన్, ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్‌రావు, భారతి, సలావుద్దీన్, కీర్తి, ప్రకాష్, శరత్‌బాబు, గంగారం, శ్రీనివాస్, కరుణశ్రీ, శ్రీకాంత్, పద్మ అభినందించారు.

రోడ్డుపై గుంతను పూడ్చివేసిన అధికారులు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



ప్రమాదకరంగా ఉన్న గంతపై మొరంతో చదును చేసిన సిబ్బంది

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో ప్రమాదకరంగా మారిన గంతను పూడ్చాలని సారు.. గుంత పూడ్చరూ.. అనే కథనం బుధవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు మొరంతో గుంతను బుధవారం ఉదయం పూడ్చేశారు. దీంతో కాలనీవాసులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తి

రుద్రంగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణలు బుధవారం పూర్తికావడంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు సాయంత్రం గుర్తులు కేటాయించారు. మండలంలో పది గ్రామాలకు ఏడు గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటితో పాటు వార్డులు కూడా ఏకగ్రీవం కావడంతో మండలంలో మూడు గ్రామాలు రుద్రంగి, మానాల, దెగవాత్ తండా గ్రామాల్లో సర్పంచ్, వార్డుల సభ్యులకు ఎన్నికలు జరగనున్నారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీల్లో అడ్డబోరుతండా సర్పంచ్‌గా గుగులోత్ మంజులతో పాటు ఆరు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. గైదిగుట్ట తండా సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్‌తో పాటు ఆరు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. వీరునితండా సర్పంచ్‌గా గుగులోత్ మంజులతో పాటు ఆరు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. చింతమణితండా సర్పంచ్ గుగులోత్ సింధూజతో పాటు ఆరు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. బడితండా సర్పంచ్‌గా మాలోత్ రామ్‌దాస్‌తో పాటు ఎనిమిది వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్‌తో పాటు ఎనిమిది వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచ్ తండా సర్పంచ్‌గా మాలోత్ రజితతో పాటు ఎనిమిది వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన మూడు గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి.

● చందుర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా చందుర్తి మండలంలో మొదటి విడత జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ పర్వం బుధవారం సాయంత్రంతో ముగిసింది. చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీలో 64 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉండగా, 29 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు 145 వార్డుల్లో 347మంది వార్డు సభ్యుల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి ఆయా గ్రామాల రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించారు. మండలంలోని 19 గ్రామాల్లో 29 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అనంతపల్లిలో 5, బండపల్లిలో 2, దేవునితండాలో 6, జోగాపూర్‌లో 1, కట్టలింగంపేటలో 3, కిష్టంపేటలో 1,మల్యాలలో 1,మర్రిగడ్డలో 3, మూడపల్లిలో 1, నర్సింగాపూర్‌లో1, రావన్నపేటలో1, సనుగులలో 3, తిమ్మాపూర్‌లో 1 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు.



రుద్రంగి మండలంలోని గైదిగుట్టతండా గ్రామపంచాయతీ

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 47మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అంతకుముందు 51నామినేషన్లు దాఖలు కాగా బుధవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మండలంలో 104 వార్డుల్లో 270 నామినేషన్లు దాఖలు కాగా 49మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 14వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 90వార్డుల్లో 218మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోటీలో అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించారు. మండలంలోని మారుపాక 7, చంద్రగిరి4, గుర్రవానిపల్లి 3, సంకెపలి7, రుద్రవరం3, అనుపురం 3, ఆరేపల్లి 3, కొడుముంజ 3, చింతల్ ఠాణా 5 , చీర్లవంచార్ అండ్ ఆర్ 5, శభాష్‌పల్లి 4 గురు అభ్యర్థులు పోటిలో ఉన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవ సర్పంచులుగా ఎన్నికయ్యారు. కమ్మరిపేట తండా మాలోతు మంజుల, ఊరు తండా ఇస్లావత్ మంజుల ఏకగ్రీవ సర్పంచులతో పాటు వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవమయ్యాయి. కాగా మిగిలిన 26 గ్రామపంచాయతీ స్థానాలకు 122 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కోనరావుపేటలో 238 వార్డు స్థానాలు ఉండగా ఇందులో 92 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 146 వార్డు స్థానాలకు 459 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరందరికీ బుధవారం సాయంత్రం వరకు గుర్తులు కేటాయించారు.

● ఇల్లంతకుంట : మండలంలోని 35 గ్రామపంచాయతీ స్థానాలకు 112 మంది అభ్యర్థులు, 294వార్డుసభ్యుల స్థానాలకు 597మంది నామినేషన్లు దాఖలు చేశారు. పలువరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సెట్ల నామినేషన్లు వేయడంతో బుధవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని మూడు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, పలు గ్రామాల వార్డుసభ్యుల స్థానాలు అనధికారికంగా ఏకగ్రీవం అయ్యాయి. గ్రామాలలో పోటీలో ఉన్న కొంతమందిని బరిలోనుండి తప్పించడానికి ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ఎక్కువ మంది పోటీలో ఉంటే ఇబ్బందికరంగా మారుతుందని నామినేషన్లు వేసిన అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు.

● వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలంలో మొదటి విడత జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలో 52 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉండగా, 42 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. 146వార్డుల్లో 262 మంది వార్డుసభ్యుల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి ఆయా గ్రామాల రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించారు. మండలంలోని 17 గ్రామాల్లో 42 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు.

మలి విడత నామినేషన్ల పరిశీలన

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలన పూర్తయ్యింది. మండలంలో 30 సర్పంచ్ స్థానాలకు 130 నామినేషన్లు అర్హత సాధించగా, 252 వార్డు సభ్యుల స్థానాలకు 547 అర్హత సాధించినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో ఒక్క నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదు. కాగా వేణుగోపాల్‌పూర్, బాలమల్లుపల్లె గ్రామాల సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషన్ అర్హత సాధించాయి. అలాగే 252 వార్డులలో 64 వార్డులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో పాటు పరిశీలనలో అర్హత సాధించాయి. దీంతో మండలంలో 28 సర్పంచ్ పదవులకు, 188 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తంగళ్లపల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రంలో పరిశీలన సందర్భంగా అభ్యర్థులకు సమాచారం అందివ్వడంలో గందరగోళం ఏర్పడింది. సమాచార లోపంతో నామినేషన్ పరిశీలనలో 90శాతం అభ్యర్థులు పాల్గొనలేదు.



తంగళ్లపల్లిలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

● ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలంలోని 35 గ్రామపంచాయతీ స్థానాలకు 112మంది అభ్యర్థులు, 294 వార్డు సభ్యుల స్థానాలకు 597మంది నామినేషన్లు దాఖలు చేశారు. పలువరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సెట్ల నామినేషన్లు వేయడంతో బుధవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని మూడు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, పలు గ్రామాల వార్డుసభ్యుల స్థానాలు అనధికారికంగా ఏకగ్రీవం అయ్యాయి. గ్రామాలలో పోటీలో ఉన్న కొంతమందిని బరిలోనుండి తప్పించడానికి ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ఎక్కువ మంది పోటీలో ఉంటే ఇబ్బందికరంగా మారుతుందని నామినేషన్లు వేసిన అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు.

● బోయినపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలంలోని 23 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు దాఖలైన నామినేషన్లను అధికారులు పరిశీలించారు. 190 నామినేషన్లు ఉన్నట్లు తెలిపారు. 212 వార్డులకు 533 నామినేషన్లు దాఖలు కాగా, ఇందులో 30 వార్డులకు సింగిల్ నామినేషన్ దాఖలయ్యాయి. దీంతో వారంతా ఏకగ్రీవం కానున్నారు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం 25వ వార్డు పద్మనగర్ కార్మికవాడలో బుధవారం పీఎంపీ, ఆర్‌ఎంపీ ఫార మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్, కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. ప్రజలు పెద్దసంఖ్యలో వైద్య శిబిరానికి చేరుకోగా వైద్యుడు ప్రకాష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిర్లు కుడికాల రవికుమార్, మాసం భాస్కర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, నాయకులు గుర్రం కిరణ్, పొన్నం లక్ష్మీనారాయణ, వంగరి దత్తు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తంగల్లపల్లి మండలం జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కళాశాల డీన్ సునీత దేవి వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని సందర్భంగా జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను కళాశాలకు ఆహ్వానించి ఆధునిక వ్యవసాయ మెళకువలు, పద్ధతులు వాటి ఉపయోగాలు వివరించారు. భవిష్యత్తులో వ్యవసాయ విద్య ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జోగినిపెల్లి అనురాధ, ఉపాధ్యాయులు రాజేశ్వరావు, రమేష్, శైలజ, శిరీష, సంతోష్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జగిత్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ నందయ్యకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

తుది విడత నామినేషన్ల స్వీకరణ షురూ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట,వ వీర్నపల్లి మండలాల్లో మూడో విడత పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. వివిధ గ్రామాల్లో అభ్యర్థులు నామినేషన్ల బుధవారం ర్యాలీగా వెళ్లి దాఖలు చేశారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మొదటి రోజు 66 సర్పంచ్, వార్డులకు 100 నామినేషన్లను అధికారులు స్వీకరించారు. ఎల్లారెడ్డిపేటలో మొత్తం 26 గ్రామ పంచాయతీలకు 56 సర్పంచ్, 226 వార్డులకు 89 నామినేషన్లు, వీర్నపల్లిలో 17 గ్రామ పంచాయతీలకు 10 సర్పంచ్, 132 వార్డులకు 11 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి, సింగారం, బాకురుపల్లితండా, గుండారం, గుంటపల్లిచెరువుతండా, కిష్టునాయక్‌తండాలలో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండా, మద్దిమల్ల, మద్దిమల్లతండా, రంగంపేట, లాల్‌సింగ్‌తండా, సీతారాంనాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్‌తండా, శాంతినగర్‌లో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు వెంకటాపూర్, హరిదాస్‌నగర్, గొల్లపల్లి, మద్దిమల్ల, రంగంపేట, గర్జపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల జిల్లా నోడల్ అధికారి, డీఆర్డీవో శేషాద్రి, ఆర్డీవో వెంకటేశ్వర్లు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. స్వీకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖ, తదితరులు ఉన్నారు.



గొల్లపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల జిల్లా నోడల్ అధికారి శేషాద్రి

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలో మూడవ విడత నామినేషన్ల పర్వం బుధవారం మొదలైంది. మండలంలో 22 గ్రామపంచాయతీలుండగా 45 నిమినేషన్లను వేయగా, 202 వార్డు స్థానాలకు 100 మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. కాగా, సాయంత్రం అయిదు గంటల వరకు నామినేషన్ కేంద్రలకు వచ్చిన వారికి అనుతించి రాత్రి ఎనిమిది గంటల వరకు నామినేషన్‌లను స్వీకరించారు. మొదటిరోజు మంచి రోజు కావడంతో చాలా మంది నామినేషన్ల కోసం ఎగబడ్డారు.ఆలస్యం కావడంతో కొంత తిరిగివెళ్లారు.

ముస్తాబాద్‌లో 144 సెక్షన్ అమలు



ముస్తాబాద్‌లో నామినేషన్ సెంటర్ వద్ద బారులు తీరిన అభ్యర్థులు

ముస్తాబాద్‌లో 144 సెక్షన్ 400 మీటర్ల వరకు విధించడంతో దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కూడలిలో ప్రధాన రహదారిపై మేజర్ పంచాయతీ భవనం ఉండటంతో అక్కడే నామినేషన్ల స్వీకరించారు. అతి సమస్యాత్మాక కేంద్రంగా ముస్తాబాద్ ఉండటంతో నామినేషన్ కేంద్రం నుండి 400 మీటర్ల 144 సెక్షన్ విధించారు. ఈ పరిధిలో ఉన్న వైన్‌షాపులు, మెడికల్ దుకాణం, కిరాణ షాపులు, జిరాక్స్ సెంటర్లు, హోటళ్లు బట్టల దుకాణాదారులు పలువురు ఇబ్బందులు పడ్డారు. మూడు రోజుల పాటు ఇలాఉంటే ఎలా అని గిరాకీలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.

వార్డు సభ్యుడిగా దివ్యాంగుడి నామినేషన్..

- కేంద్రం బయటకు వచ్చి పత్రాలు స్వీకరించిన రిటర్నింగ్ అధికారి

ఇల్లంతకుంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఒగులాపూర్ గ్రామానికి చెందిన సమ్మెట సతీష్ అనే దివ్యాంగుడు వార్డు సభ్యుడిగా నామినేషన్ దాఖలుచేశాడు. గ్రామంలోని రెండో వార్డు జనరల్ స్థానానికి కేటాయించారు. క్లస్టర్ నామినేషన్ కేంద్రం అయిన వెల్జీపూర్ గ్రామానికి సతీష్ వాహనంపై వెళ్లాడు. లోపలికి రావడం ఇబ్బందిగా ఉందని చెప్పడంతో రిటర్నింగ్ అధికారి బయటకు వచ్చి నామినేషన్‌పత్రాన్ని తీసుకున్నాడు. ఈ విషయం బుధవారం సోషల్‌మీడియాల్ వైరల్ అయ్యింది.

ఘనంగా శ్రీకాంతచారి వర్ధంతి

ముస్తాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలో శ్రీకాంత్‌చారి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణా రాష్ట్ర సాధన కోసం అమరుడైన శ్రీకాంత్‌కు జోహార్ అంటూ నివాళులర్పించారు. ప్లేక్సీకిపూలమాలలు వేసి ఉద్యమ స్ఫూర్తిని నెమరువేసుకున్నారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు సద్గుణాచారి, ఒరగంటి తిరుపతి, బాలబ్రహ్మం, సామాజిక కార్యకర్త సుంచు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీల్లో గ్రామస్థుల సంబరాలు

ఇల్లంతకుంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఏకగ్రీవ గ్రామపంచాయతీలలో గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనుండగా, నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. చిక్కుడువానిపల్లె, తిప్పాపూర్, కేసన్నపల్లె గ్రామాల్లో సర్పంచ్,వార్డుస్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. కేసన్నపల్లె గ్రామంలో మాత్రం ఒక వార్డు కోసం ఇద్దరు అభ్యర్థులు పోటీపడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో సర్పంచ్ బరిలో అభ్యర్థులు ఉండగా, వార్డు స్థానాలు కొన్ని ఏకగ్రీవమయ్యాయి. చిక్కుడువానిపల్లె సర్పంచ్‌గా కల్యాణ్, తిప్పాపూర్ సర్పంచ్‌గా బొల్లవేని మంజుల, కేసన్నపల్లె సర్పంచ్‌గా పోతరాజు చంటిలు ఏకగ్రీవం కాగా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీంతో గ్రామాల్లో బుధవారం టపాసులు కాల్చి,స్వీట్లను పంపిణీ చేశారు. ఏకగ్రీవమైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

ఆకట్టుకుంటున్న నామినేషన్ మహోత్సవ ఆహ్వాన పత్రాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, తదితర గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసే వారు ప్రజలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, యువకులు, రైతులందరికీ నమస్కారం.. మీ ఆశీర్వదంతో పోటీలో నిలబడుతున్నా.. నా నామినేషన్ మహోత్సవ కార్యక్రమానికి తరలివచ్చి తనను దీవించాలంటూ తమ ఫోటోలతో ముద్రించిన ఆహ్వాన పత్రాలు ఆకట్టుకుంటున్నాయి.